క్లుప్తంగా

విద్యార్థులకు సామగ్రి వితరణ



విద్యార్థులకు సమాగ్రి అందజేస్తున్న ఉపాధ్యాయురాలు

కడప ఎడ్యుకేషన్ : కడప మండల పరిధిలోని వైఎస్సార్‌కాలనీలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కడపకు చెందిన శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ఆధ్వర్యంలో ఉచితంగా పలకలు, నోట్‌బుక్స్, కాపీరైటింగ్‌బుక్స్ వితరణ చేశారు. మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి పిల్లలకు విద్యాసమాగ్రిని అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు నాగరాజు పాఠశాల తరఫున శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్‌కు కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి అంతిమ సంస్కారం



అంత్యక్రియలకు తీసుకెళ్తున్న సేవాసమితి సభ్యులు

కడప అర్బన్ : చెన్నూరు మండలానికి చెందిన పిచ్చిరెడ్డి (85) అనే వృద్ధుడు కడప నగర శివార్లలో చౌడమ్మ వృద్ధాశ్రమంలో అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. కాశీ విశ్వనాథ సేవాసమితి సభ్యులు హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు సింగపూర్‌లో ఉంటున్న నాగుల పవన్‌కుమార్ ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాశీ విశ్వనాథసేవాసమితి అధ్యక్షుడు రెడ్డి లక్ష్మణ్, ఆర్టీసి రిటైర్డ్ డీఎం నాగుల రాంప్రసాద్, పుట్టా పురుషోత్తం, లింగారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, టైలర్ రవి, మధు పాల్గొన్నారు.

ప్రయాణికులను గౌరవించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికులను గౌరవించాలని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్ రెడ్డి సూచించారు. మంగళవారం కడప నగరంలోని ఆర్‌ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో హైర్ బస్సు డ్రైవర్‌కు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థకు ప్రయాణీకులు కీలకమన్నారు. వారి సహాయ సహకారాలతోనే సంస్థ అభివృద్ధి పథంలో పయనిస్తోందని తెలిపారు. డ్రైవర్లు ప్రయాణీకుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ వారికి సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడప, పులివెందుల. ప్రొద్దుటూరు, బద్వేలు. మైదుకూరు. జమ్మలమడుగు డిపోల డ్రైవర్లు పాల్గొన్నారు.

2 నుంచి మండల పూజ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో జూలై 2 నుంచి సుబ్రహ్మణ్యస్వామికి మండల పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. అలాగే లోకకల్యాణార్థం గణపతి, సుబ్రహ్మణ్య, ధన్వంతరి హోమాలు నిర్వహిస్తామని తెలిపారు.

గౌరవ వేతనం చెల్లించాలంటూ వినతి

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో ఎంపీడీఓ వరప్రసాదరావుకు మంగళవారం వలంటీర్లు వినతిపత్రం అందచేశారు. గత నెలలో అన్ని చోట్లా గౌరవ వేతనం ఇచ్చారని, పోరుమామిళ్లలోని నాలుగు సచివాలయాల్లో మాత్రం వేతనం ఇవ్వలేదని వారు ఎంపీడీఓ దృష్టి తెచ్చారు. తాము రాజీనామా చేయలేదని, అయినా గౌరవ వేతనం నిలుపుదల చేయడం సబబు కాదన్నారు. తమకు వేతనం చెల్లించేలా చొరవ చూపాలని వలంటీర్లు ఎంపీడీఓకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎంపీడీఓ స్పందిస్తూ వలంటీర్లకు న్యాయం చేస్తామన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆరోగ్యమే మహాభాగ్యమని, విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని హోమియో వైద్యుడు టి.మునిరాం ప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిధిలోని కల్లూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మంగళవారం మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాలు, గుడ్లు, ఆకుకూరలు, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కుర్‌కురే, పానిపూరి తదితర వాటిని తినకూడదని సూచించారు. పాఠశాలలోని 240 మంది విద్యార్థులకు డయేరియా రాకుండా ముందస్తుగా నివారణా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జె.సురేష్‌బాబు, కాంపౌండర్ నాగేశ్వరి, ఆశావర్కర్ రాణి, ఎంఎన్ఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే!



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



భక్తులకు మాంగల్య దర్శనం చేయిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : దేవుని కడప శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రవణానక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును నిర్వహించిన అర్చకులు స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో మహా మంగళ సూత్రాలను అలంకరించారు. ఉభయ దారులతో పూజలు నిర్వహింపజేసి వారితో పాటు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇటీవలే మూడు రోజులపాటు ఆలయ చరిత్రలో తొలిసారిగా సహస్ర కలశాభిషేకాలు నిర్వహించారు. ఆ రోజు స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు రాలేకపోయిన వారు కల్యాణం రోజున దర్శించుకోవడం పుణ్యదాయకమని భావించి విశేష సంఖ్యలో కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త



ఆలంఖాన్‌పల్లెలో పర్యటిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్ : సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు సూచించారు. డయేరియా క్యాంపెయిన్ అవేర్‌నెస్ ప్రోగామ్‌లో భాగంగా కడప నగరంలోని ఆలంఖాన్‌పల్లె తదితర ప్రాంతాల్లో డీఎంహెచ్ఓ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహనతో సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట వేయవచ్చన్నారు. వ్యాధులు రాకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. వేడి చేసి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. పండ్లు, కూరగాయలను శుభ్రంగా మంచినీటితో కడిగిన తర్వాతనే ఉపయోగించాలన్నారు. చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉబేదుల్లా, డాక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజుపాళెంలో వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని వి.రాజుపాళెం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డా.ఓబులేసు తెలిపారు. గ్రామంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ ప్రజలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేయటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

రజక సంఘం నాయకుడి మృతికి సతాపం

మైదుకూరు : మైదుకూరు పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన రజక సంఘం నాయకుడు ఎం.పాపయ్య (54) మంగళవారం మృతి చెందాడు. ఆయన గతంలో రజక సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం బ్రహ్మంగారి మఠం క్షేత్రంలోని రజక అన్నదాన సత్రం ప్రతినిధిగా ఉంటున్నారు. పాపయ్య మృతదేహం వద్ద పలువురు రజక సంఘం, బీసీ సంఘం నాయకులు నివాళి అర్పించారు. ఆయన మృతి పట్ల బీసీ సంఘం నాయకులు పత్తూరు వీరభద్రుడు, నాయని పెద్దన్న తదితరులు సంతాపం తెలిపారు.

ఎమర్జెన్సీ ఓ చీకటి అధ్యాయం



మాట్లాడుతున్న బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : 'ప్రజాస్వామ్యానికి తల్లివంటి భారతదేశంలో ఎమర్జెన్సీ విధించిన జూన్ 25ను ఎప్పటికీ మర్చిపోలేం' అని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి అన్నారు. ఎమర్జెన్సీ ఓ చీకటి అధ్యాయమని చెప్పారు. ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవ సందర్భంగా మంగళవారం కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో బీజేపీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ చీకటి రోజులు, అప్పుడు జరిగిన ఘటనలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు వంగళ శశిభూషణ్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలకృష్ణ యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, సంజీవ్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సురేంద్ర, అశోక్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు వినతి

ప్రొద్దుటూరు : అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని మంగళవారం విజయవాడలో మంత్రులు నారా లోకేష్, గుమ్మడి సంధ్యారాణిలకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ) నాయకులు వినతి పత్రాలు అందజేశారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ 42 రోజులు సమ్మె చేసినప్పుడు శిబిరాల వద్దకు మంత్రి లోకేష్ వచ్చి అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రులు చెప్పినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు ఎస్.మంజుల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.మల్లేశ్వరి పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న కార్పొరేట్ పాఠశాలలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని పీఆర్ఎస్‌వైఎఫ్ కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కార్పొరేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల గుర్తింపును రద్దు చేసి వారిపైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌సీవైఎఫ్‌జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు, జిల్లా నాయకులు వెంకటేష్, సుధీర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో అవినీతిని డీఎల్ నిరూపించాలి

ఖాజీపేట : ఖాజీపేట మేజర్ పంచాయతీలో అవినీతి జరిగినట్లు ఆరోపిస్తున్న మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి వాటిని నిరూపించాలని ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఖాజీపేట ఉపసర్పంచ్ దుగ్గిరెడ్డి సుధామణి సవాల్ విసిరారు. మంగళవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఖాజీపేట మేజర్ పంచాయతీలో గడిచిన మూడు సంవత్సరాల్లో రూ.80 లక్షల అభివృద్ధి పనులు జరిగిన మాట నిజమే అన్నారు. అందులో ఎలాంటి అవినీతి జరగలేదన్నారు. గతంలో ఖాజీపేట మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా, మండలాధ్యక్షురాలుగా డీఎల్ సుభద్రమ్మ పని చేసిందని, అప్పటి నుంచి జరిగిన పనులపై ఖాజీపేట బస్టాండ్‌లో చర్చకు సిద్ధమా అని సవాల్ చేశారు. పుల్లూరు పంచాయతీలో మాజీ సర్పంచ్ వీరారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డిలు ఎంతో అభివృద్ధి చేశారన్నారు. సొంత స్థలం దానంగా ఇచ్చారని గుర్తు చేశారు. అలాంటి వారిని పంచాయతీకి వస్తే సహించమని అధికారులను బెదిరించడం ఎమిటని ప్రశ్నించారు. ఇలాంటి దౌర్జన్యలను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అరికట్టాలన్నారు.

నింగి, నేలకు ఎర్రంచు చీర



ఆకాశంలో కనువిందు చేసిన దృశ్యం

వర్షం వస్తుందని మేఘమాలిక ప్రజలకు చల్లని కబురు తెచ్చింది. నింగి నేల మధ్యలో ఎర్రంచు చీర కనువిందు చేస్తోంది. మబ్బుల మేఘాలు మందగమనంతో నేలపైకి దిగుతున్న ఈ మనోహరమైన దృశ్యం మంగళవారం సాయంత్రం కడప నగరంలో ఆవిష్కృతమైంది.

– కడప అగ్రికల్చర్

భక్తి శ్రద్ధలతో కుంకుమార్చన



ప్రత్యేక అలంకరణలో రతనాల వెంకటేశ్వరస్వామి



ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారి జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున రతనాల వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, స్వామివారి చెల్లెలు లలితాదేవి ఉత్సవమూర్తులకు విశేష అభిషేకాలు, పూజలు చేసి అలంకరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చన చేసి విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

విజయదుర్గమ్మ సన్నిధిలో రాహుకాల పూజలు



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల దీపాలు వెలిగించారు. తెల్లవారుజామున పంచామృతాభిషేకం, షోడశోపచార పూజలు నిర్వహించారు. సాయంత్రం 3 గంటల అనంతరం ఆలయ ఆవరణలో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని నవగ్రహాలకు పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులకు ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ తీర్థ ప్రసాదాలు అందజేశారు.



రాహుకాల పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ప్రభుత్వ బడిని రక్షించుకుందాం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఈఓ మర్రెడ్డి అనురాధ

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ బడిని రక్షించుకుందాం .. బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి అనే నినాదంతో యూటీఎఫ్ కడప జిల్లా శాఖ కరపత్రాలను ముద్రించింది. మంగళవారం డీఈఓ మర్రెడ్డి అనురాధ చేతుల మీదుగా కరప్రతాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో నైతిక విలువలు, చదువు, సంస్కారం దేశభక్తి, సమానత్వ భావనలతో విద్యాబుద్ధులు బోధిస్తారని తెలిపారు. ఉపాధ్యాయులు బడి బయట ఉన్న పిల్లలను బడిలే చేర్పించడం, ప్రభుత్వ బడిలోని సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియచేసి వారి పిల్లలను బడిలో చేర్పించేందుకు కృషి చేయాలని సూచించారు. యూటీఎఫ్ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం పాటుపడుతోందని డీఈఓ మర్రెడ్డి అనురాధ కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ప్రతి ఉపాధ్యాయుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి నరసింహారావు, జిల్లా కార్యదర్శులు పివి రమణ, అడహక్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు కృష్ణారెడ్డి, గోపీనాథ్, చంద్రశేఖర్, కేదార్నాద్, కరీముల్లా, సమీర్‌బాషా, శివకుమార్‌రాజు, వెంకటసుబ్బయ్య, సురేష్‌కుమార్, సుబ్బారెడ్డి, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి



డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్‌ఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని మేథస్వీ పాఠశాల ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తోందని ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ తెలిపారు. పాఠశాల నిర్వహణ కోసం అనుమతి లేకున్నా.. ఉన్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులను నమ్మించి అడ్మిషన్లు పొందారని పేర్కొన్నారు. నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రారంభానికి ముందే కరపత్రాలు ద్వారా ప్రచారం చేసి అడ్మిషన్లు పొందారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు హరిబాబు, నాయకులు సాయి, సంతోష్, సుమంత్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోండి

బద్వేల్ పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కళాశాలను నిర్వహిస్తున్నా.. పట్టించుకోని అధికారులపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ డిమాండ్ చేశారు. మంగళవారం కడప ఇంటర్ ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళాశాలలో మౌలిక వసతులు కూడా లేవని ఆరోపించారు. ఇప్పటికైనా కళాశాలపై సమగ్ర విచారణ చేసి సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగమయ్య, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల మంజూరు చేయాలి



ఉర్దూ పాఠశాల ఆవరణలో నిరసన తెలియజేస్తున్న ఆవాజ్ నాయకులు, విద్యార్థులు

బద్వేలు అర్బన్ : పట్టణంలో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి.చాంద్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మహబూబ్‌నగర్ వీధిలోని ప్రభుత్వ ఉర్దూ హైస్కూల్ ఆవరణలో విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాల లేని కారణంగా ఎంతో మంది ఉర్దూ మీడియం పది పాసైన విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్య కోసం కడప, ప్రొద్దుటూరు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. గతంలో అనేక దఫాలు సమస్యను విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకుపోయినా ఏ మాత్రం ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉర్దూ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని, లేనిపక్షంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఆవాజ్ పట్టణ అధ్యక్షులు ఎస్.ఎ.సత్తార్, పట్టణ నాయకులు మస్తాన్, రసూల్, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్.మహబూబ్‌బాషా, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేములమ్మా.. వర్షం కురిపించవమ్మా

మండల పరిధిలోని వేములూరు గ్రామానికి చెందిన మహిళలు వేములమ్మా వర్షం కురిపించమంటూ వేములమ్మకు బోనాలు సమర్పించారు. ఈ ఏడాది జూన్ మాసం దాటుతున్నా పదును వర్షాలు లేకపోవడంతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో వేములూరు గ్రామానికి చెందిన ప్రజలు గ్రామ సమీపంలో వెలసిన వేములమ్మకు పార్టీలు, కులమతాలకు అతీతంగా వర్షాలు కురిపించాలని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

– అట్లూరు



వేములమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు